ప్రభుత్వ స్థలాల కబ్జాకు యత్నాలు

- ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డుల తొలగింపు
- ఆ స్థలాల్లో మట్టి డంపింగ్

మలక్‌పేట: ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు భూ కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పాగా వేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడి కబ్జాదారుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. సైదాబాద్ మండల పరిధిలోని మూసారంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్, శాలివాహననగర్ పార్కు ఎదురుగా, పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టారు. ఎవరైనా ఈ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. బోర్డుపై సంబంధిత రెవెన్యూ అధికారులు సెల్ నంబర్లు కూడా రాయించారు. ప్రభుత్వ హెచ్చరికను సైతం లెక్క చేయకుండా నేతల అండదండలతో కొందరు వ్యక్తులు ఆ స్థలాలను కబ్జా చేయడానికి యత్నిస్తున్నారు. అధికారులు పాతిన బోర్డులు పీకేసి మట్టికుప్పలతో నింపేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సలీంనగర్‌లో..

సలీంనగర్ రెవెన్యూ భవన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం (బోనోవెకెన్సీ ల్యాండ్) కబ్జా చేయడానికి కబ్జాదారులు నానా రకాలుగా కుట్రలు చేశారు. అయితే కాలనీవాసుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు ఖాళీ స్థలంలో బోర్డు పెట్టారు. పక్కన గోడపై బోనోవెకెన్సీ లాండ్ అని రాయించారు. నాలుగైదు సార్లు బోర్డు పీకేసి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కబ్జాదారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఖాళీ స్థలం పక్కనున్న గోడపై ఇది ప్రభుత్వ స్థలమని రాశారు. మరోసారి 2021 మే నెలలో బోర్డు ఏర్పాటు చేశారు. అయితే గోడపై అధికారులు రాసిన రాతలు చెరిపేసి, బోర్డు పీకేశారు. స్థలాన్ని చదును చేయడానికి ఇటీవల మట్టి కుప్పలు పోయించారు.



గతంలో.. సలీంనగర్‌లోని ఖాళీ స్థలంలో అధికారులు పెట్టిన బోర్డు



ప్రస్తుతం.. ఆ స్థలంలో బోర్డు తీసేసి మట్టిపోసిన దృశ్యం

శాలివాహననగర్‌లో..

శాలివాహననగర్‌లో పార్కు తూర్పు దిక్కున ఉన్న ఖాళీ స్థలాని కబ్జా చేయడానికి 2020లో భూమిని చదును చేశారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు పెట్టారు. అయితే భూ కబ్జాదారులు బోర్డుపై ఉన్న అక్షరాలను నల్లరంగుతో చెరిపేశారు. తప్పుడు పత్రాలు తయారు చేసి ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.



శాలివాహననగర్‌లో.. నల్ల రంగుతో బోర్డుపై ఉన్న అక్షరాలను చెరిపేసిన కబ్జాదారులు

పరిరక్షణ చర్యలు తీసుకుంటాం



మండలంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలలో పాతిన బోర్డులను కబ్జాదారులు తీసేసినట్లు నా దృష్టికి రాలేదు. మూసారంబాగ్‌లోని ప్రభుత్వ స్థలాలను సందర్శిస్తాం. బోర్డు లేని చోటా బోర్డులు పెట్టిస్తాం. కబ్జాకు గురికాకుండా రక్షణ ఏర్పాట్లు చేస్తాం..ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిస్తే స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నా. – జయశ్రీ, తహసీల్దార్, సైదాబాద్

మంత్రులకు శుభాకాంక్షలు



రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో గురువారం బాధ్యతలు తీసుకున్న రాష్ట్ర ఐటీ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న హస్తినాపురం వాసి వెదిరె యోగీశ్వర్‌రెడ్డి.

పొంగులేటికి...



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు దుబ్బాక గోపాల్‌రెడ్డి తదితరులు.

– హస్తినాపురం

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న అవంతి పీజీ కాలేజీ విద్యార్థులు

మలక్‌పేట: రక్తదానం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని అవంతి పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కాలేజీలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సంవత్సరానికి ఒక్కసారైనా ప్రతీ విద్యార్థి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ భార్గవ్‌రాజు, హెచ్‌డీఎఫ్‌సీ సీనియర్ మేనేజర్ పాండురంగ విఠల్, కాలేజీ ఇన్‌చార్జి మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులకు, కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ కాలనీవాసులు

నాగోలు: డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ కోరారు. గురువారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో జలమండలి డీజీఎం మాధవి, మేనేజర్ అలేఖ్యతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కాలనీలో ఎలాంటి డ్రైనేజీ సమస్య రాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు, కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో త్వరలోనే డ్రైనేజ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్కైవేల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సాగర్‌రింగ్ రోడ్డులో నిర్మిస్తున్న స్కైవే ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఔటర్ రింగ్‌రోడ్డు తరహాలో సాగర్‌రింగ్ రోడ్డులో లూప్ ఆకారంలో నిర్మిస్తున్న స్కైవే ఫ్లైఓవర్లు పూర్తైతే ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారమవుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఆర్‌డీపీ పనుల్లో భాగంగా రూ.135 కోట్లతో చేపట్టిన ఈ పనులను అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్బీనగర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఉద్దేశించిన స్కై ఫ్లైఓవర్లను వచ్చే సంక్రాంతి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీర్లు పనులను వేగవంతం చేయాలని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన 47 ప్రాజెక్టుల్లో 36 అందుబాటులోకి వచ్చాయని, వీటిలో సాగర్ రింగ్‌రోడ్డులో సెకండ్ లెవల్ ఫ్లైఓవర్‌తో పాటు రెండు లూప్స్ స్కై ఫ్లైఓవర్లు సైతం ప్రత్యేక నిర్మాణాలుగా చరిత్రలో నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఎల్‌బీనగర్, చంపాపేట, సాగర్‌రింగ్‌రోడ్డు మార్గాలవైపు వెళ్లేందుకు ఈ లూప్ లైన్లు ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్.ఈ రవీందర్‌రెడ్డి, ఈఈ రోహిణి, డీఈ కార్తీక్, ఏఈ పరమేశ్, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు

కాచిగూడ: అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ.. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాణి సక్కుబాయి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల బదిలీలలో నాన్ స్పౌజ్ (భార్యాభర్తల్లో ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి) ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివక్షతను సరి చేయాలని, తద్వారా ఉపాధ్యాయుల మధ్య సమానత్వాన్ని కాపాడాలని ఆమె కోరారు.

కారును ఢీకొట్టాడని లారీ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి

నాగోలు: ప్రమాదవశాత్తూ కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై హెడ్‌కానిస్టేబుల్ దాడి చేసి, బలవంతంగా నష్టపరిహారం వసూలు చేసిన ఘటన నాగోలు డివిజన్ బండ్లగూడ చౌరస్తాలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ తన కుటుంబంతో కలిసి కారులో తట్టిఅన్నారం నుంచి బండ్లగూడ వైపు వస్తున్నాడు. అదే దారిలో ఇసుక లోడ్‌తో ఓ లారీ వస్తోంది. బండ్లగూడ చౌరస్తా వద్ద వాటర్ లీకేజీ కావడంతో మరమ్మతుల కోసం బుధవారం రాత్రి జలమండలి అధికారులు రోడ్డును కొంత మేర మూసివేశారు. అక్కడకు లారీ, కారు ఒకేసారి వచ్చాయి. లారీ డ్రైవర్ కారును గమనించకుండా ముందుకు పోనివ్వడంతో కారుకు ఎడమ వైపుకొంత గీసుకుపోయింది. వెంటనే కారులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బయటకు దిగి లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ అతడిపై దాడి చేశాడు. దీంతో స్థానికంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుడు ఒకరు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుండగా హెడ్ కానిస్టేబుల్ అతడినీ దుర్భాషలాడాడు. స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి రావడంతో కారును లారీ ఢీకొట్టడంతో అలా అన్నానని చెప్పాడు. అనంతరం అక్కడకు వచ్చిన నాగోలు పోలీసుల సాయంతో లారీ డ్రైవర్ నుంచి బలవంతంగా డబ్బు తీసుకుని వెళ్లిపోయారు. ఫ్రెండ్లీ పోలీస్ అని చెప్పుకునే పోలీసులు డ్రైవర్‌పై దాడి చేయడం, స్థానికులను తిట్టడం ఏమిటని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉన్నత అధికారులు కలుగజేసుకొని హెడ్ కానిస్టేబుల్‌కు కౌన్సిలింగ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

స్పీకర్‌కు అభినందనలు





రాష్ట్ర శాసన సభ నూతన స్పీకర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల.

తెలంగాణలో జనరంజక పాలన విజయవంతం కావాలి



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న చిలుక నర్సింహారెడ్డి బృందం

చిలుక నర్సింహారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జనరంజకంగా, విజయవంతంగా ముందుకు సాగాలని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్టు రాష్ట్ర టీఎన్జీఓస్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం కావడంతో నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ ఎంప్లాయీస్ బృందం తిరుమల శ్రీవేకంటేశ్వర స్వామిని దర్శించుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు చేయూతనందిస్తూ ఉద్యోగులతో స్నేహభావంతో మెలగాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

ఎల్‌బీనగర్: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య కిట్‌లను గురువారం లచ్చిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న లచ్చిరెడ్డి

ఫుట్‌పాత్ వ్యాపారులకు అండగా ఉంటా..



సుధీర్‌రెడ్డిని కలిసిన జోగు రాములు, చిరువ్యాపారులు

నాగోలు: కొత్తపేట బీజేఆర్ భవన్ నుంచి అష్టలక్ష్మి ఆలయం కమాన్ వరకు ఫుట్‌పాత్‌పై పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులకు తాను అండగా ఉంటానని, అధికారులతో చర్చించి త్వరలోనే వీరి సమస్యకు పరిష్కారం చూపుతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు ఆధ్వర్యంలో చిరువ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇష్టానుసారంగా చలాన్లు వేస్తూ తోపుడు బండ్లను తొలగిస్తున్నారని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. చిరువ్యాపారుల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతానని సుధీర్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ జన జాగృతి ఫోరం అధ్యక్షురాలు ఉషారాణి, ఎండీ నవాజ్ ఖాన్, ఎండీ యూసుఫ్, షేక్ అబ్దుల్ వాజిద్, ఎండీ బాబుమియా, తులసి రామ్, ప్రదీప్, కృష్ణవేణి, శైలజ, సంతోషి, పూస నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు మార్గశిరమాస ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు 23వ తేదీన వైకుంఠ ఏకాదశి, జనవరి 11న కూడార్ మహోత్సవం, 14వ తేదీన శ్రీ గోదా రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.

నగరాభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం



పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, వారు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం ఆమె పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు నిర్విరామంగా కృషి చేస్తున్నారని, వారిసేవలను ప్రభుత్వం గుర్తించి అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పోగుల నర్సింహ, సతీష్‌గౌడ్, బానోతు శ్రీనివాస్ నాయక్, కప్పూర నాయక్, భవాని పాల్గొన్నారు.

మట్టి స్నానం.. మహారోగ్యం!

- మానసిన ప్రశాంతత
- వివిధ రుగ్మతలు నయం
- రోగ నిరోధక శక్తి పెంపు
- ఆసక్తి చూపుతున్న నగరవాసులు



మట్టిస్నానం చేస్తున్న ధ్యానులు

హుడాకాంప్లెక్స్: పంచభూతాల్లో మట్టి ఒకటి. మట్టి లేకపోతే మనుగడే లేదు. పుట్టింది మొదలు, చనిపోయేవరకు మట్టితో విడదీయరాని సంబంధం ఉంది. వైద్య పరిభాషలో మడ్‌బాత్‌గా పిలుచుకొనే మట్టి స్నానానికి ఆదరణ పెరుగుతోంది. కష్టపడకుండానే ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే సదుపాయం ఉండటంతో నగరవాసులు మట్టి స్నానంపై ఆసక్తి చూపుతున్నారు. రక్తపోటును అదుపులో పెట్టడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుకుంటున్నారు. మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్ వేదికగా ఈ మడ్‌బాత్ స్నానంపై శిక్షణ ఇస్తున్నారు యోగ గురువు ఇస్మాయిల్.

కాంతివంతంగా..

మహా ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. మట్టిలో సప్త ధాతువులు ఉంటాయి. భూమిలో ఉండే ఖనిజాల గుణములన్నీ మట్టిలో మమేకమై ఉంటాయి. మట్టితో స్నానం చేసినప్పుడు శరీరానికి సహజంగా ఉండే గ్రహణశక్తి.. మట్టిలోని సప్త ధాతువులు శరీరంలోకి ప్రవేశించడం వలన కాంతివంతంగా, ఆరోగ్యవంతంగా మారుతుంది. స్నానానికి ఉపయోగించే బురద సాధారణంగా సహజమైన బంకమట్టి, ఎర్రమట్టి, పుట్టమట్టిని నీటితో కలిపి తగిన ఉష్ణోగ్రతలో వేడి చేస్తారు. ఆ తర్వాత బురదను శరీరానికి పూస్తారు. పూసిన తర్వాత 15 నుంచి 20 నిమిషాల పాటు బురదలో నానబెడతారు.

నిరోధకశక్తి పెంపు

మట్టి స్నానం వలన చాలా ప్రయోజనాలు కలుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు. మట్టిలో ఉండే వేడి రక్త ప్రసరణను పెంచడానికి, రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు సహాయపడుతుంది. అయితే బురదలోని ఖనిజాలు అనేక రకాల వైద్యం లక్షణాలను కలిగి ఉన్నాయని నమ్ముతారు. మట్టి స్నానంతో కండరాల నొప్పి, మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

మహిళల కోసం ప్రత్యేకం

''అనారోగ్యంగా ఉంటే ఆయా ప్రదేశాల్లో మట్టిని ఎంత సమయం ఉంచాలి? ఏ విధంగా తగ్గుతుంది. అనే విధానంపై సూచనలిస్తున్నాం. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళ యోగ ట్రైనర్‌తో శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులు యోగ శిక్షణ పూర్తి చేసుకున్న శిష్యులందరినీ తీసుకెళ్లి.. మట్టి యోగము, జలయోగము, క్రియాయోగము, సూర్యయోగము అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో పచ్చి కూరగాయలతో చేసిన వంటలకే అధిక ప్రాధాన్యత ఇస్తాం. ఈ ప్రక్రియ వలన అనేక రోగాలు నయం కావడాన్ని మేము గమనించాం'' అని ఇస్మాయిల్ గురూజీ తెలిపారు.

ఆరోగ్య సమాజమే లక్ష్యం



యోగా రత్న, యోగా సేవారత్న, స్వధర్మ యోగి, నేషనల్ ఇంటర్నేషనల్ అవార్డులు పొందాను. 20 సంవత్సరాలుగా వివిధ రకాల యోగా శిక్షణ ఇస్తూ... యోగా సేవలో జీవితాన్ని గడుపుతున్నాను. యోగాలో శిక్షణ ఇస్తూ ఆరోగ్య సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం.

–ఇస్మాయిల్ గురూజీ

కలుషిత నీటి సరఫరాను నివారించండి



పూలతోట బస్తీలో తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న సహదేవ్‌యాదవ్, వాటర్ వర్క్స్ అధికారులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లో కలుషిత నీరు సరఫరా కాకుండా వాటర్ వర్క్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా డివిజన్ పరిధిలోని పూలతోట బస్తీలో కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన గురువారం మాదన్నపేట వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. తాగునీరులో మురుగు వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. ఒక పైప్‌లైన్‌లో కలుషిత నీరు సరఫరా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైపులు వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సహదేవ్‌యాదవ్ అధికారులను కోరారు. వాటర్ వర్క్స్ మేనేజర్ కలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డికి భూ బాధితులు వినతిపత్రం ఇచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని సర్వే నంబర్ 2లోని భూ బాధితులు గురువారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమిని చిత్రం వంశానికి చెందిన బాధితులకు అందేలా న్యాయం చేయాలని విన్నవించారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడ్ల శ్రీనివాస్, రమేశ్, పోచమ్మ, ఎలమ్మ, దేవయ్య, ముత్యాలు, యాదయ్య, సుధాకర్, శ్రీనివాస్, మహేందర్ తదితరులున్నారు.